సాక్షి రంగారెడ్డి

మంగళవారం । 21 । జనవరి । 2025



ఆక్రమిస్తే సహించం

దేవాలయాల భూములను అన్యాక్రాంతం చేయాలని చూస్తే సహించేదిలేదని ఎండోమెంట్ ఆఫీసర్ హెచ్చరించారు. 8లో▸



అన్ని రంగాల్లో ఎదగాలి

బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని బీసీసేన జాతీయ అధ్యక్షుడు కృష్ణ అన్నారు. 8లో▸



నిరంతర పోరాటం

సీపీఐ గొప్పతనాన్ని ప్రజలకు తెలియజేయాలని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి అన్నారు. 8లో▸

30వేల ఎకరాలు

సాగుకు యోగ్యం కాని భూములు

- జిల్లాలో పూర్తయిన గుర్తింపు సర్వే
- నేటి నుంచి 24 వరకు గ్రామ, వార్డు సభలు
- అనర్హుల జాబితా వెల్లడి.. అభ్యంతరాల స్వీకరణ
- 25న ఆన్‌లైన్‌లో నమోదు.. 26 నుంచి 'రైతు భరోసా'



మొయినాబాద్: క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: సాగుకు యోగ్యంగా లేని భూముల గుర్తింపు ప్రక్రియ జిల్లాలో సోమవారంతో ముగిసింది. ఈనెల 16 నుంచి 20 వరకు రెవెన్యూ, వ్యవసాయ అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి జిల్లాలోని 21 మండలాల పరిధిలో సుమారు 30 వేల ఎకరాలకుపైగా సాగుకు యోగ్యంగా లేని భూములు ఉన్నట్లు తేల్చింది. వీటిలో ఎక్కువగా మ్యూటేషన్ కాని పాత పంచాయతీ లే అవుట్లు, గోదాములు, ఫంక్షన్ హాళ్లు, భారీ షెడ్లు, కొండలు, గుట్టలు ఉన్నట్లు గుర్తించింది. గుర్తించిన ఆయా భూముల సర్వే నంబర్లను మంగళవారం నుంచి 24 వరకు నిర్వహించే గ్రామ సభల్లో ప్రకటించనుంది. ఏ ఏ సర్వే నంబర్లు రైతు భరోసాకు అనర్హమైనవో అధికారులు వివరించనున్నారు. ఈ సందర్భంగా ఆయా రైతుల నుంచి వచ్చే అభ్యంతరాలను స్వీకరించనున్నారు. తుది జాబితాను 25న ఆన్‌లైన్‌లో నమోదు చేసి, 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రైతు భరోసా పథకం కింది ఆయా రైతుల ఖాతాల్లో నగదు జమ చేయించనుంది.

భారీగా తగ్గే అవకాశం

2023–24 యాసంగి నాటికి జిల్లా వ్యాప్తంగా 4,04,429 మంది రైతులు ఉండగా, వీరిలో గత ప్రభుత్వం తీసుకొచ్చిన 'రైతుబంధు' పోర్టల్‌లో 3,25,216 మంది రైతుల ఖాతాల్లో రూ.343.10 కోట్లు జమ చేశారు. ప్రస్తుతం వీరి సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. బాలాపూర్, కందుకూరు, మహేశ్వరం మండలాల్లో 47,550 మంది రైతులు ఉండగా, 35,205 మందికి రైతుబంధు కింద గతంలో నగదు జమ చేశారు. ఇక అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం మండలాల పరిధిలో 69,703 మంది రైతులు ఉండగా, వీరిలో 60,217 మంది ఖాతాల్లోనే నగదు జమ చేశారు. చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి, షాబాద్ మండలాల్లో 1,03,716 మంది రైతులు ఉండగా, 73,793 మంది రైతుల ఖాతాల్లో నగదు జమ చేశారు. ఫరూఖ్‌నగర్, జిల్లేడు చౌదరిగూడ, కేశంపేట, కొందుర్గు, నందిగామ, కొత్తూరు మండలాల్లో 92,662 మంది రైతులు ఉండగా, వీరిలో 76,642 మంది ఖాతాల్లోనే నగదు జమ చేశారు. గండిపేట, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, శంషాబాద్ మండలాల్లో 16,298 మంది రైతులు ఉండగా, వీరిలో 11,238 మంది రైతుల ఖాతాల్లో నగదు జమ చేశారు. ఇక ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల్, మాడ్గుల మండలాల్లో 74,498 మంది రైతులు ఉండగా, వీరిలో 68,143 మంది రైతుల ఖాతాల్లోనే నగదు జమ అయింది. తాజాగా అధికారుల నివేదికతో 'రైతు భరోసా' కింద లబ్ధి పొందే రైతుల సంఖ్య భారీగా తగ్గనుంది.

జిల్లాలో భూముల స్వరూపం (ఎకరాల్లో)..

జిల్లా భౌగోళిక విస్తీర్ణం	12,42,504
వ్యవసాయ యోగ్యమైన భూమి	8,85,547
వ్యవసాయేతరాలకు	1,84,082
ఇతర బీడు భూమి	2,06,034
తడి భూమి	2,28,216
పొడి భూమి	3,29,352
అటవీ భూమి	64,800
బంజరు భూమి	54,882
శాశ్వత పచ్చిక బయళ్లు	37,650
పండ్ల తోటలు, ఇతర చెట్లు	9,825
కొండలు, గుట్టలు	14,285

సాగుకు యోగ్యమైన వాటికే..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సాగులో లేని బంజరు, బీడు భూములకు, మ్యూటేషన్ కానీ జీపీ లే అవుట్లు, ఫంక్షన్ హాళ్లకు, గోదాములకు, ఫాం హౌస్‌లకు రైతు బంధు ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సాగుకు యోగ్యమైన భూములకు మాత్రమే రైతు భరోసా ఇవ్వనున్నట్లు ప్రకటించి, ఆ మేరకు రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో క్షేత్రస్థాయి సర్వే చేపట్టింది. యాచారం మండలంలో అత్యధికంగా 5,500 ఎకరాలకుపైగా, ఆమనగల్లు మండలంలో 599.23 ఎకరాలు, కడ్తాల్ మండలంలో 629 ఎకరాలు, మొయినాబాద్ మండలంలో 2,400 ఎకరాలు, చేవెళ్ల మండలంలో 2,806 ఎకరాలు సాగుకు యోగ్యం లేనట్లు గుర్తించి ఆ మేరకు వాటికి రైతుభరోసా నిలిపివేయనున్నట్లు పేర్కొంది. సోమవారం రాత్రి పొద్దు పోయే వరకు అధికారులు ఆయా భూముల లెక్కలు తేల్చే పనిలోనే నిమగ్నమయ్యారు.



ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణ రెడ్డి

నేటి నుంచి గ్రామ సభలు

- కలెక్టర్ నారాయణరెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్ కార్డులు), ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల ద్వారా అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా ఈ నెల 21 నుంచి 24 వరకు అన్ని గ్రామాల్లో గ్రామసభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డితో కలిసి ఆయా విభాగాల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సర్వే పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించే గ్రామసభలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని, హాజరయ్యే ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు జారీ చేయడం జరుగుతుందని, ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్రామ సభల్లో వచ్చిన దరఖాస్తులను స్వీకరించడంతో పాటు ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను సైతం పరిశీలించడం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ పథకంలో కనీసం ఇరవై రోజుల పాటు కూలి పనికి వెళ్లిన వారికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింప చేయడం జరుగుతుందని, కుటుంబంలోని మహిళ బ్యాంకు ఖాతాలోనే మొత్తాన్ని జమ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. అధికారులు నిర్లక్ష్యానికి తావు లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ ఎలాంటి అపోహలకు తావు లేకుండా.. ప్రజల నుంచే అందే విజ్ఞప్తులను స్వీకరించాలని ఆదేశించారు.

ప్రజావాణిలో అర్జీలను వెంటనే పరిష్కరించాలి

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల అధికారులు తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అర్జీలను పెండింగ్ పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. 38 రెవెన్యూ, 10 ప్రజాపాలన, 9 హౌసింగ్‌కు సంబంధించిన అర్జీలు అందినట్లు ప్రకటించారు.

ఆర్టీసీ కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలి

షాబాద్: కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అసిస్టెంట్ కార్గో మేనేజర్ ఇషాక్ బిన్ మహమ్మద్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం ఆయన కార్గో సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్గో ద్వారా వినియోగదారులకు డోర్‌డెలివరీ సదుపాయం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో షాద్‌నగర్ డిపో డీఎంఈ శ్రీనివాస్, షాబాద్ ఆర్టీసీ బస్టాండ్ మేనేజర్ వెంకటేశ్, కార్గో నిర్వాహకుడు మల్లేష్, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



షాబాద్‌లో సేవలను ప్రారంభిస్తున్న అధికారి

న్యూస్‌రీల్

కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడండి



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మొయినాబాద్: కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడాలని తోలుకట్ట గ్రామస్తులు కలెక్టర్ నారాయణరెడ్డికి విన్నవించారు. మండల పరిధిలోని తోలుకట్ట గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నారాయణరెడ్డికి ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. తోలుకట్ట రెవెన్యూలోని సర్వేనంబర్లు 108, 107, 85, 139, 138, 137, 143లో ఉన్న సుమారు 126 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని తెలిపారు. ఇటీవల 108, 143 సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూమిని అక్రమార్కులు కబ్జా చేశారని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని.. ఫిర్యాదు చేసిన గ్రామస్తులపై కబ్జాదారులు కేసులు పెట్టారని చెప్పారు. తమకు నోటీసులు ఇచ్చి, తమ ఇళ్లవద్దకు బౌన్సర్లను పంపి బెదిరింపులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమార్కులపై చర్యలు తీసుకుని కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడాలని కలెక్టర్‌ను కోరారు. ఫిర్యాదు చేసినవారిలో గ్రామస్తులు శివశంకర్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, రాజుగౌడ్, యాదయ్య, నవీన్, మహేందర్, విక్రమ్, సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' వివరాల పరిశీలన



కందుకూరు ఎంపీడీఓ కార్యాలయంలో వివరాలను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ శ్రీలత

కందుకూరు: ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు అమలు చేయనున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి సంబంధించిన వివరాలను డీఆర్‌డీఓ శ్రీలత సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో పరిశీలించారు. మండలంలో ఎంతమంది లబ్ధిదారులు ఉన్నారు.. వారి వివరాలు సక్రమంగా నమోదు చేశారా లేదా అనే అంశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఎలాంటి భూమి లేని, ఉపాధిహామీ పథకంలో 2023–24లో కనీసం 20 రోజుల పనిదినాలు పూర్తి చేసిన వారికి ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం అందుతుందని తెలిపారు. అది కూడా రెండు విడతల్లో ఉంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 14,284 మంది లబ్ధిదారులను గుర్తించినట్లు చెప్పారు. గ్రామ సభల్లో మరోసారి వారి వివరాలను సరిచూస్తామన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ సరిత, సిబ్బంది ఉన్నారు.

పంటలు పండించే పొలాలను తీసుకోవద్దు



రైతులతో మాట్లాడుతున్న భూసేకరణ అధికారి

కందుకూరు: ఫ్యూచర్ సిటీ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న మండల పరిధిలోని రాచులూరు రైతులతో సోమవారం అధికారులు సమావేశమయ్యారు. భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ జీవీఎస్ రాజు, తహసీల్దార్ గోపాల్ తదితరులు రైతులతో చర్చించారు. ప్రభుత్వం భూసేకరణ చట్టం కింద పరిహారం అందించనుందని వివరించారు. దీనిపై స్పందించిన రైతులు తాము పంటలు పండించే పొలాలను రహదారి నిర్మాణానికి తీసుకోవద్దని, ప్రత్యామ్నాయ మార్గాన్ని అన్వేషించాలని కోరారు. తుక్కుగూడ నుంచి శ్రీశైలం రహదారిని కొత్తూర్ గేట్ వరకు విస్తరిస్తే తమ భూములు కోల్పోవాల్సిన అవసరం ఉండదన్నారు. తప్పనిసరైతే భూమికి భూమి ఇవ్వాలని, లేదా బహిరంగ మార్కెట్ ప్రకారం ఎకరాకు రూ.4 కోట్ల చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుల అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో భూసేకరణ నాయబ్ తహసీల్దార్ విజయ్‌కుమార్, ఆర్‌ఐ యాదగిరి, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

గ్రంథాలయాల పాత్ర కీలకం

- మంత్రి జూపల్లి కృష్ణారావు

షాద్‌నగర్: సమాజంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పట్టణంలోని గ్రేడ్–1 గ్రంథాలయ అభివృద్ధి కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకరోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రంథాలయాలను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రంథాలయాల్లో డిజిటలైజేషన్ చేయడం గొప్ప పరిణామమని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. సమాజంలో ఏమార్పు జరగాలన్నా గ్రంథాలయాలతో సాధ్యం అవుతుందని అన్నారు. తెలంగాణ చరిత్రను మార్చిన ఘనత గ్రంథాలయానికి ఉందన్నారు. అనంతరం గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులతో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్‌గా మదన్‌మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా నక్కబాల్‌రాజ్, ప్రధాన కార్యదర్శిగా క్యాసెట్ శ్రీను తదితరులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, నాయకులు బాబర్‌ఖాన్, రఘునాయక్, తిరుపతిరెడ్డి, విశ్వం, బాల్‌రాజ్‌గౌడ్, బస్వం, కొంకళ్ల చెన్నయ్య, దంగు శ్రీను పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- ఎమ్మెల్యే సబితా రెడ్డి

మీర్‌పేట: కాలనీల అభివృద్ధికి రాజకీయాలు, పార్టీలకు అతీతంగా నిధులు కేటాయించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలో రూ.5.41 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు సోమవారం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. గతంలో రేషన్‌కార్డులు, పెన్షన్లు, ఇళ్ల కోసం ప్రజలు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నారని, మళ్లీ ఇప్పుడు దరఖాస్తులు ఇవ్వాలనడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. గతంలో ఇచ్చిన దరఖాస్తులు ఎక్కడికి వెళ్లాయని ప్రశ్నించారు. పెన్షన్లు, రైతుబంధు ఇవ్వడానికి మళ్లీ సర్వే చేయడం ఎందుకని నిలదీశారు. ఇచ్చిన హామీ మేరకు ఎకరాకు రూ.15వేలు రైతు బంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వార్డు, గ్రామసభల్లో అర్హత ఉన్న వారంతా నిలదీయాలని సూచించారు. కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, డీఈ వెంకన్న, ఏఈ శ్రీనివాసులు, కార్పొరేటర్లు ఎడ్ల మల్లేశ్ ముదిరాజ్, భిక్షపతిచారి, తీగల మాధవి, మోదల బాలకృష్ణ, అనిల్‌యాదవ్, కీసర హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పార్కు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సబితారెడ్డి, ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

ఫోర్త్‌సిటీ మెట్రోపై అధ్యయనం

సాక్షి, సిటీబ్యూరో: మెట్రోరెండో దశలో భాగంగా ఎయిర్‌పోర్టు నుంచి ఫోర్త్‌సిటీ వరకు ప్రతిపాదించిన ఆరవ కారిడార్ రూట్‌లో హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైల్ లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సోమవారం పర్యటించారు. సుమారు 40 కిలోమీటర్ల వరకు నిర్మించనున్న ఈ రూట్‌పైన ఆయన క్షేత్రస్థాయిలో ప్రాథమిక సర్వే నిర్వహించారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి స్కిల్ వర్సిటీ వరకు ఈ కారిడార్ నిర్మాణం కోసం సుమారు రూ.6 వేల కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనా. రెండో దశలో ప్రస్తుతం 5 కారిడార్లకు మాత్రమే డీపీఆర్ పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో కేంద్రం అనుమతికి పంపించారు. ఫోర్త్‌సిటీతో పాటు నార్త్‌సిటీలో రెండు కారిడార్లకు సైతం డీపీఆర్‌లను రూపొందించేందుకు హెచ్ఏఎంఎల్ కసరత్తు చేపట్టింది. ఈ క్రమంలోనే ఆదివారం నార్త్‌సిటీ కారిడార్‌లలో ఇంజినీరింగ్ నిపుణులతో కలిసి ఎన్వీఎస్ పర్యటించారు. సోమవారం ఫోర్త్‌సిటీ రూట్‌ను సర్వే చేశారు. ఫోర్త్‌సిటీ, నార్త్‌సిటీ కారిడార్‌లతో మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.40 వేల కోట్లు దాటే అవకాశం ఉందని అధికారుల అంచనా.

14,284

- జిల్లాలో భూమి లేని నిరుపేదలు
- ఈనెల 26 నుంచి 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'
- లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: భూమి లేని వ్యవసాయ కూలీలు 14,284 మంది ఉన్నట్లు జిల్లా యంత్రాంగం గుర్తించింది. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్)లో భాగంగా జిల్లాలోని 21 మండలాలు 545 పంచాయతీల పరిధిలో 1,61,035 కుటుంబాలు జాబ్ కార్డులు కలిగి ఉండగా, 2,68,002 మంది కూలీలు తమ పేర్లు నమోదు చేసుకుని ఉన్నారు. వీరిలో 41,990 కుటుంబాల్లో 57,060 మంది ఉపాధి హామీ పథకం కింద లబ్ధి పొందారు. ఇందులో 14,284 మందికి సెంటు భూమి కూడా లేనట్లు గుర్తించింది. కందుకూరులో అత్యధికంగా 1,928 మందికి, యాచారంలో 1,742 మందికి, అత్యల్పంగా కొత్తూరులో 85 మందికి భూమి లేనట్లుగా తేల్చింది. వీరికి 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకం కింద ఈనెల 26 నుంచి రెండు విడతల్లో (ఒక్కో విడతలో రూ.6 వేల చొప్పున)రూ.12 వేలు ఖాతాల్లో జమ చేయనుంది.

లబ్ధిదారుల వివరాలు..

మండలం	గ్రామాలు	లబ్ధిదారులు
అబ్దుల్లాపూర్‌మెట్	18	995
ఆమనగల్లు	13	463
చేవెళ్ల	33	253
చౌదరిగూడ	24	465
ఫరూఖ్‌నగర్	43	773
ఇబ్రహీంపట్నం	14	855
కడ్తాల్	24	501
కందుకూరు	35	1928
కేశంపేట	27	426
కొందుర్గు	22	489
కొత్తూరు	12	85
మాడ్గుల	32	1196
మహేశ్వరం	31	395
మంచాల	22	1187
మొయినాబాద్	27	127
నందిగామ	18	183
షాబాద్	41	552
శంషాబాద్	27	173
శంకర్‌పల్లి	26	530
తలకొండపల్లి	32	966
యాచారం	24	1,742

ఎఫ్‌టీఎల్ నిర్ధారణతో సమస్యలకు చెక్

- నాలుగైదు నెలల్లో ఈ ప్రక్రియ పూర్తికి నిర్ణయం
- ప్రజావాణిలో ప్రకటించిన హైడ్రా కమిషనర్

సాక్షి, సిటీబ్యూరో: ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) లోపల ఉన్న చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) నిర్ధారణ పూర్తయితే అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. నాలుగైదు నెలల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి కసరత్తు చేస్తున్నట్లు సోమవారం నాటి ప్రజావాణిలో ప్రకటించారు. భవిష్యత్తులో చెరువుల కబ్జాకు ఎలాంటి అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. బుద్ధభవన్‌లోని హైడ్రా ప్రధాన కార్యాలయంలో సోమ వారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 89 ఫిర్యాదులను ఆయన పరిశీలించారు. ఉదయం 11 నుంచి రాత్రి 7.30 గంటల వరకు ఈ కార్యక్రమం జరిగింది. చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల కబ్జాపై వచ్చిన ఫిర్యాదులను రంగనాథ్ పరిశీలించారు. గూగుల్ మ్యాప్స్‌తో పాటు సర్వే ఆఫ్ ఇండియా, నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ ఇమేజీలను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఫిర్యాదుదారులకు చూపించి వాస్తవాలపై ఆరా తీశారు. గతంలో ఆయా చెరువులు, ప్రభుత్వ స్థలాలు, పార్కులు ఎలా ఉండేవి..హైడ్రా వచ్చిన తర్వాత ఎలా ఉన్నాయనేది గుర్తిస్తున్నామని, హైడ్రా వచ్చిన తర్వాత వెలసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామన్నారు. అమీన్‌పూర్ లేక్ చుట్టూ ఉన్న ప్రాంతాలపై అనేక ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఆ మున్సిపాలిటీ పరిధిలో పూర్తిస్థాయి సర్వే చేయించాలని హైడ్రా కమిషనర్ నిర్ణయించారు. నిజాంపేట మున్సిపాలిటీ పరిధిలోనే మేడికుంట చెరువు 45 ఎకరాల పరిధిలో ఉండేదని, కబ్జాలతో చెరువు కుంచించుకుపోయిందని వృద్ధ దంపతులు ఫిర్యాదు చేశారు. మల్కాజిగిరిలోని డిఫెన్స్ కాలనీలో ప్రజావసరాలకు కేటాయించిన వెయ్యి గజాల స్థలాన్ని స్థానిక ప్రజాప్రతినిధి కబ్జా చేస్తున్నారంటూ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫిర్యాదు చేసింది. మూసాపేటలోని ఆంజనేయనగర్ రోడ్డు నంబరు 9లో 2 వేల గజాల పార్కు స్థలం కబ్జాకు గురి అవుతోందని, అడ్డుకున్న తమపై కబ్జాదారులు దాడికి దిగుతున్నారని స్థానికులైన భార్యాభర్తలు ఫిర్యాదు చేశారు. ఈ పార్కు అభివృద్ధికి ప్రభుత్వం రూ.50 లక్షలు కేటాయించడంతో పాటు శిలాఫలకం కూడా వేసిందని పేర్కొన్నారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై హైడ్రా కమిషనర్ క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయించాలని నిర్ణయించారు.



బీసీలు అన్ని రంగాల్లో ఎదగాలి

బీసీసేన జాతీయ అధ్యక్షుడు కృష్ణ



చంద్రశేఖర్, మాణెయ్యలను సన్మానిస్తున్న బీసీ నేతలు

షాబాద్: బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ముదిరాజ్ భవన్‌లో బీసీ ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమితులైన కావలి చంద్రశేఖర్, బీజేపీ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన మద్దూరు మాణెయ్యలను ఘనంగా సన్మానించారు. అనంతరం కృష్ణ మాట్లాడుతూ.. హక్కుల సాధనకోసం బీసీలు సమష్టిగా పోరాడాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజా చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు నర్సింహులు, కుర్వ సంఘం మండల అధ్యక్షుడు పాండు, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు లింగం, మాసయ్య, గౌరవ అధ్యక్షుడు వెంకటయ్య, బీసీ ఐక్యవేదిక నాయకులు రవీందర్, స్వామి, నర్సింహులు, మహేందర్, శ్రీనివాస్‌గౌడ్, సత్తయ్య, ఆనందం, చెన్నయ్య, గౌరీశ్వర్ పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్ కేటాయించాలి

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ డిమాండ్ చేశారు. మండల పరిధి మన్మర్రి గ్రామంలో సేన గ్రామ కమిటీ అధ్యక్షుడిగా జెట్టని శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా ఉల్లి కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా గడ్డమీది రాజు, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలలో ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. బీసీల లెక్క తేలడానికి దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన అగ్రకులాలకు ఒక రోజులో బిల్లు పెట్టి, ఆగమేఘాల మీద 10 శాతం రిజర్వేషన్లు ఆమోదించారని, వారికి రిజర్వేషన్లు పెంచడానికి మూడు రోజుల్లో లోక్‌సభ, రాజ్యసభలో సవరణ చేసి రాష్ట్రపతి సంతకం చేశారని వెల్లడించారు. కానీ 50 శాతం జనాభా ఉన్న బీద కులాలకు రాజ్యాంగ సవరణ చేయరా అని ప్రశ్నించారు. మూడు దశాబ్దాలుగా పోరాడుతున్నా బీసీల బిల్లును కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం ఆరోపించారు. పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి, చట్టసభల్లో 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలన్నారు.

ఆలయ భూములను ఆక్రమిస్తే సహించం

ఎండోమెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మురళీకృష్ణ

ఇబ్రహీంపట్నం: దేవాలయాల భూములను అన్యాక్రాంతం చేయాలని చూస్తే సహించేది లేదని ఇబ్రహీంపట్నం మండల ఎండోమెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మురళీకృష్ణ హెచ్చరించారు. పట్నం చెరువు కట్ట కింద ఉన్న శ్రీ వీరభద్రేశ్వర ఆలయానికి సంబంధించిన 2 ఎకరాల 22 గుంటల భూమిని పరిరక్షించేందుకు సూచిక బోర్డులను సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ, కొంతమంది ఆలయ భూములను కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని అనుమానం వ్యక్తంచేశారు. మండల పరిధి 16 దేవాలయాలు ఎండోమెంట్ పరిధిలో ఉన్నాయని తెలిపారు. దేవుడి మాన్యం అన్యాక్రాంతం కాకుండా సర్వే చేయించి ఫెన్సింగ్ వేయిస్తామని పేర్కొన్నారు. వ్యవసాయ యోగ్యంగా ఉన్న భూములను వేలం పాట ద్వారా కౌలుకు ఇస్తామని, తద్వారా వచ్చే ఆదాయాన్ని ఆయా ఆలయాల అభివృద్ధికి వెచ్చిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం సెంట్రల్ కమిటీ రాష్ట్ర సభ్యుడు శెట్టి శివకుమార్, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆనందప్ప, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుమారప్ప, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు మహేందర్, అనిల్, సంతోష్, ఫణికుమార్, ఆలయ పూజారి పవన్ ఉన్నారు.



ఆలయ భూమిలో సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న దేవాదాయ శాఖ అధికారి

రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

- అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు
- సమీక్ష సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్



సాక్షి, సిటీబ్యూరో: అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసిందని, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరంతర ప్రక్రియ అని, చివరి లబ్ధిదారు వరకు వాటిని అందిస్తామని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరిస్తున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డితో కలిసి హైదరాబాద్ నగర పరిధిలో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల సర్వే పురోగతిపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రేషనింగ్ అధికారి, జిల్లా సరఫరా అధికారి, జోనల్ కమిషనర్లతో సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల కోసం ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులందరికీ వాటిని ఇస్తామని స్పష్టం చేశారు. ఇంటి స్థలం ఉన్నవారు, లేనివారికి కూడా ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. రేషన్ కార్డులేనివారు వార్డు సభల్లో దరఖాస్తు చేసుకోవచ్చని, వీటితోపాటు గతంలో ప్రజాపాలన, సేవాకేంద్రాలు, ప్రజావాణిల్లో వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలించాలని అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులను ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు.

అవగాహన కల్పించాలి

రేషన్ కార్డుల కోసం దరఖాస్తులను స్వీకరించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందనే అంశంపై అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు స్పష్టంగా అవగాహన కల్పించాలని మంత్రి పొన్నం ఆదేశించారు. అధికారులందరూ కలిసికట్టుగా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, అలివేలు మంగతాయారు, జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, అనురాగ్ జయంతి, అపూర్వ చౌహాన్, రవికిరణ్, ఉపేందర్‌రెడ్డి, వెంకన్న, రెవెన్యూ డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.

హైదరాబాద్ కిడ్నీ సెంటర్ వైద్యుడి మృతి

చౌటుప్పల్: హైదరాబాద్ మలక్‌పేటలోని హైదరాబాద్ కిడ్నీ సెంటర్ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ ఎర్రబోతు విష్ణువర్ధన్‌రెడ్డి(68) సోమవారం మృతి చెందారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామానికి చెందిన ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం స్థానికంగానే జరిగింది. వైద్య వృత్తిలోకి వచ్చాక సొంతంగా ఆస్పత్రి ఏర్పాటు చేసుకున్నారు. ఎంతోమంది కిడ్నీ రోగులకు వైద్య సేవలందించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సోమవారం ఉదయం మృతి చెందారు.

అంబులెన్సులో రెండు సుఖప్రసవాలు

కందుకూరు: మూడు గంటల వ్యవధిలో ఒకే 108 అంబులెన్స్ సిబ్బంది ఇద్దరు గర్భిణులకు సుఖప్రసవం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి నేదునూరు గ్రామ సమీపంలోని ఇటుక బట్టీల్లో పని చేస్తున్న ఒడిస్సా రాష్ట్రానికి చెందిన నలినిబాయికి పురిటి నొప్పులు వచ్చాయి. రెండో కాన్పు నిమిత్తం ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో 108కి సమాచారం అందించారు. దీంతో ఆమెను ఆస్పత్రికి తరలించే క్రమంలో నొప్పులు ఎక్కువ అయ్యాయి. దీంతో ఈఎంటీ రాయుడు, పైలట్ యాదయ్య ఆమెకు సుఖప్రసవం చేయగా మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డను మహేశ్వరంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. వారిద్దరు ఆరోగ్యంగానే ఉన్నారు.

రాత్రి 2గంటలకు..

అదే రాత్రి 2 గంటల సమయంలో మండల పరిధి లేమూరుకు చెందిన సంధ్యకు పురిటినొప్పులు రావడంతో 108కి సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న రాయుడు, యాదయ్య ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా నొప్పులు అధికమవడంతో వాహనంలో ప్రసవం చేశారు. ఆమె ఆడపిల్లకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డను శంషాబాద్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగానే ఉన్నారు. ఈ రెండు కేసుల్లో సమయానికి ప్రసవం చేసిన సిబ్బందిని మహిళల కుటుంబీకులు అభినందించారు.



పసికందును కుటుంబీకులకు అప్పగిస్తున్న 108 సిబ్బంది

అదృశ్యమైన వ్యక్తి.. క్షేమంగా ఇంటికి

హయత్‌నగర్: ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఓ వ్యక్తి క్షేమంగా తిరిగి వచ్చాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి తొర్రూర్ బాలాజీనగర్‌లో నివసించే బత్తుల మహేశ్(30) ప్రైవేటు ఉద్యోగి. శనివారం కుటుంబీకులు మందలించడంతో ఆత్మహత్య చేసుకోవాలని ఇబ్రహీంపట్నం చెరువు కట్ట వద్దకు బైకుపై వెళ్లాడు. బైకు, హెల్మెట్, బ్యాగు, పర్సును కట్టపై ఉంచాడు. చెరువులోకి దూకేందుకు యత్నించగా.. నీటిని చూసి భయపడ్డాడు. అక్కడి నుంచి ఇంటికి వెళ్లకుండా ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి, బెంగళూరు బస్సెక్కి వెళ్లిపోయాడు. బయటకు వెళ్లిన యువకుడు ఇంటికి రాకపోవడంతోఆందోళనకు గురైన కుటుంబీకులు ఆదివారం హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. మహేశ్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పట్నం చెరువు కట్టపై ఆయనకు చెందిన బైకు, ఇతర వస్తువులను గుర్తించిన పోలీసులు.. మహేశ్ ఆత్మహత్య చేసుకున్నట్లు తొలుత భావించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది చెరువులో గాలించారు. ఈ క్రమంలో యువకుడి ఫోన్ ఆన్‌లో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు.. యువకుడి ఫోన్‌కు వాట్సాప్ మెసేజ్ పెట్టారు. తిరిగి ఆ వ్యక్తి పోలీసులకు మెసేజ్ చేయడంతో.. వ్యక్తి రాయచూర్‌లో ఉన్నట్లు గుర్తించారు. పోలీసుల చొరవతో సోమవారం మహేశ్ హయత్‌నగర్ ఠాణాకు వచ్చాడు. దీంతో కుటుంబ సభ్యులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు యువకుడికి కౌన్సెలింగ్ ఇచ్చి, కుటుంబీకులకు అప్పగించారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జీపీ వర్కర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి

కేశంపేట: గ్రామ పంచాయతీల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డితో కలిసి జీపీ వర్కర్స్ కేలండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు జీఓ 60ని అమలు చేయాలని కోరారు. మల్టీపర్పస్ విధానం రద్దుచేయాలన్నారు. 2011 జనాభా ప్రతిపాదికన పంచాయతీల్లో కార్మికులను నియమించారని, ఆ విధానాన్ని రద్దు చేసి అవసరాలకు అనుగుణంగా కార్మికులను నియమించాలని డిమాండ్ చేశారు. ఎంపీఓ కిష్టయ్య, జూనియర్ అసిస్టెంట్ ప్రకాష్, కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రయ్య, మండల అధ్యక్షుడు రవి, స్వరూప ఉన్నారు.

భక్తులపై వ్యాపారుల దౌర్జన్యం

సామాజిక మాధ్యమంలో వైరల్‌గా మారిన వీడియోలు



భక్తులపై దాడి చేస్తున్న వ్యాపారులు

కొత్తూరు: ప్రఖ్యాతి గాంచిన జేపీదర్గా ఆవరణలో వ్యాపారుల ఆగడాలు పెరిగిపోతున్నాయి. తాజాగా సోమవారం దర్గా దర్శనం కోసం నగరం నుంచి వచ్చిన ఇద్దరు భక్తులపై కొందరు వ్యాపారులు తమ వద్ద పూలు కొనుగోలు చేయాలని దాడికి పాల్పడ్డారు. ఘటనకు సంబంధించిన వివరాలు సీసీ పుటేజీల్లో నిక్షిప్తం అయ్యాయి. ఆ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఇదే విషయమై స్థానిక పోలీసులను వివరణ కోరగా.. ఇరువురు భక్తులపై దర్గా ఆవరణలో పూల వ్యాపారం చేసే నలుగురు వ్యక్తులు తమ వద్ద పూలు కొనుగోలు చేయాలని దౌర్జన్యానికి పాల్పడ్డారని, కర్రలతో కొట్టినట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డ్రగ్స్ విక్రయిస్తూ పట్టుబడిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

120 మిల్లీ గ్రాముల ఎండీఎంఏ క్రిస్టల్స్ స్వాధీనం

సాక్షి, సిటీబ్యూరో: పూణే నుంచి హైదరాబాద్‌కు వాహనంలో ఎండీఎంఏ క్రిస్టల్స్ డ్రగ్స్‌ను తీసుకొని వస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను సంగారెడ్డి, డీటీఎఫ్, ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జమ్ము, కశ్మీర్‌కు చెందిన హర్జత్ సింగ్(35) అనే వ్యక్తి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూ డ్రగ్స్ వినియోగానికి అలవాటు పడ్డాడు. అతడు తన తోటి ఉద్యోగులకు డ్రగ్స్ విక్రయించేవాడు. మహారాష్ట్రలోని పూణే ప్రాంతానికి వెళ్లి అక్కడి నుంచి 120 మిల్లీ గ్రాముల ఎండీఎంఏ క్రిస్టల్స్ డ్రగ్స్‌ను తీసుకొని హైదరాబాద్‌కు వస్తుండగా సంగారెడ్డి డీటీఎఫ్, ఎక్సైజ్ పోలీసులు సంగారెడ్డి మల్కాపూర్ ఫ్లైఓవర్ తనిఖీలు నిర్వహించి వాహనాన్ని పట్టుకున్నారు. ఈ డ్రగ్స్ విలువ రూ.21.06 లక్షలు ఉంటుందని అంచనా.

సీఎస్‌ఏఎం కేసుల్లో ముగ్గురి అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: చిన్నారులకు సంబంధించిన చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ మెటీరియల్‌ను (సీఎస్‌ఏఎం) డౌన్‌లోడ్ చేసి, చూసి, ఇతరులకు పంపిణీ చేసిన ఆరోపణలపై సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు ముగ్గురు నిందితుల్ని అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు హైదరాబాద్‌కు చెందినవారని డీసీపీ దార కవిత సోమవారం వెల్లడించారు. సీఎస్‌ఏఎంను కనిపెట్టడానికి అంతర్జాతీయంగా ఎన్‌సీఎంఈసీ అనే సంస్థ పనిచేస్తోంది. ఇది ప్రపంచంలో ఎవరైనా ఆయా సోషల్ మీడియా వేదికలపై సీఎస్‌ఏఎంను సెర్చ్ చేసినా, వీక్షించినా, డౌన్‌లోడ్/అప్‌లోడ్ చేసినా తక్షణం గుర్తిస్తుంది. భారత్‌కు సంబంధించిన వివరాలను నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో(ఎన్సీఆర్బీ)కు పంపించింది. ఎన్సీఆర్బీ రాష్ట్ర నోడల్ ఏజెన్సీ సీఐడీకి ఈ వివరాలు అందించగా ఆ అధికారులు వినియోగదారుల ఐపీ అడ్రస్‌లను కనుగొన్నారు. ఈ మేరకు వారి నివాస పరిధిలోని సైబర్ క్రైమ్ ఠాణాల్లో కేసులు నమోదు చేయించారు. ఈవిధంగా ఇటీవల సిటీ సైబర్ క్రైమ్ ఠాణాల్లో మూడు కేసులు నమోదయ్యాయి. మెదక్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి(35) వివిధ వెబ్‌సైట్ల నుంచి చైల్డ్ పోర్నోగ్రఫీ వీడియోలు డౌన్‌లోడ్ చేశాడు. వీటిని వీక్షించడంతోపాటు ఇన్‌స్టాగామ్ ద్వారా తన స్నేహితులకు పంపాడు. నగరానికి చెందిన ఓ వెల్డర్(36) ఇలానే చేసి స్నాప్‌చాట్ ద్వారా షేర్ చేశాడు. సిటీకే చెందిన మరో విద్యార్థి సైతం ఇలానే చేశాడు. దీంతో ఈ ముగ్గురి వివరాలు సీఐడీ నుంచి పొందిన నగర సైబర్ క్రైమ్ పోలీసులు వేర్వేరు కేసులు నమోదు చేసి ముగ్గురిని అరెస్టు చేశారు.

రెండు బైక్‌లు ఢీ.. ముగ్గురికి గాయాలు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... కీసర మండలం బోగారంలోని హోలీమేరీ కళాశాలలో సికింద్రాబాద్‌కు చెందిన చరణ్‌కుమార్, కరీంనగర్‌కు చెందిన సూర్యప్రకాశ్(17) పాలిటెక్నిక్ రెండో సంవత్సరం చదువుతున్నారు. సోమవారం ఉదయం వారు కళాశాల నుంచి ఘట్‌కేసర్ వైపు బైక్‌పై వస్తున్నారు. కొండాపూర్ విజ్ఞాన్ మహిళా కళాశాల సమీపంలో కీసర వైపు ఘట్‌కేసర్‌కు చెందిన గులాం అహ్మద్, చెంగిచెర్లకు చెందిన ప్రహ్లాద్ ప్రయాణిస్తున్న బైక్ ఎదురుగా వస్తోంది. వేగంగా ఉన్న ఈ రెండు బైక్‌లు ఢీకొనడంతో సూర్యప్రకాశ్ తలకు తీవ్రగాయాలుకాగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. సూర్యప్రకాశ్ పరిస్థితి విషమంగా ఉండటంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రజాసమస్యలపై నిరంతర పోరాటం

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి



మాట్లాడుతున్న రామస్వామి

చేవెళ్ల: ప్రజలకు వంద వసంతాల సందర్భంగా సీపీఐ పార్టీ గొప్పతనాన్ని ప్రజలకు తెలియజేయాలని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. పార్టీ వంద వసంతాల సందర్భంగా నియోజకవర్గస్థాయి జనరల్‌బాడీ సమావేశం ఈ నెల 28వ తేదీన చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశాన్ని నియోజకవర్గంలోని ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరుకానున్నట్లు తెలిపారు. పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేసే పార్టీ సీపీఐ అన్నారు. పెద్ద ఎత్తున ప్రజాసంఘాలు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు ఈ సమావేశానికి హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి సత్తిరెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్‌బీతో మేధోశక్తి



విద్యార్థినులు కావ్య, అనన్యలను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

కడ్తాల్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు 'సాక్షి' మీడియా చేస్తున్న కృషి అభినందనీయమని ప్రగతి పాఠశాల కరస్పాండెంట్ సువర్ణగోవర్ధన్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ జైసస్ అన్నారు. సాక్షి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాక్షి స్పెల్ బీ, మ్యాథ్‌బీ పరీక్షలతో విద్యార్థుల్లో మేధోశక్తి పెంపొందుతుందని పేర్కొన్నారు. సాక్షి మీడియా ఆధ్వర్యంలో గతేడాది నవంబర్‌లో నిర్వహించిన సాక్షి స్పెల్ బీ, మ్యాథ్స్ సెమీ ఫైనల్ పరీక్షల్లో.. పాఠశాలకు చెందిన కావ్య స్పెల్‌బీలో, రావుల అనన్య మ్యాథ్స్‌బీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, ఈ నెల 22న బంజారాహిల్స్‌లోని రావినారాయణరెడ్డి ఆడిటోరియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఫైనల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం విద్యార్థులను అభినందించి, సన్మానించింది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ఇలాంటి పోటీ పరీక్షలను నిర్వహించడం సంతోషంగా ఉందని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెరగడంతో పాటు, భవిష్యత్తులో మరిన్ని పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు దోహదపడుతుందన్నారు.

నగర వైద్యుడికి ప్రతిష్ఠాత్మక అవార్డు!

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ప్రముఖ దంతవైద్యుడు డాక్టర్ వికాస్ గౌడ్‌కు 'ఫ్యామ్‌డెంట్ అవుట్ స్టాండింగ్ డెంటిస్ట్ ఆఫ్ ద ఇయర్'అవార్డు లభించింది. దంత వైద్య రంగంలో అత్యుత్తమ ప్రతిభతోపాటు రీసెర్చ్, బోధన, రోగులకు అందించే సేవల వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుని ఇచ్చే ఈ అవార్డుకు 'దంత వైద్య ఆస్కార్'అనే పేరు కూడా ఉంది. ఈ నెల 18న ముంబైలో ఫ్యామ్‌డెంట్ ఫౌండర్ డాక్టర్ అరోరాతోపాటు ప్రఖ్యాత దంతవైద్య నిపుణులు డాక్టర్ సబితా రామ్, కుమారస్వామి ఆయనకు అవార్డును అందజేశారు. డాక్టర్ వికాస్ గౌడ్ ఇంప్లాంటాలజిస్ట్ ఆఫ్ ద ఇయర్, ఈస్థెటిక్ డెంటల్ ప్రాక్టీషనర్ ఆఫ్ ద ఇయర్ అనే మరో రెండు విభాగాలకు కూడా ఎంపికయ్యారు. ఆయన పాతికేళ్లుగా దంతవైద్యంలో ఉత్తమ సేవలందిస్తున్నారు. 'ఈ అవార్డు దక్కడం నా వ్యక్తిగత విజయం మాత్రమే కాదు, నా టీమ్, గురువులు, రోజూ స్ఫూర్తినిచ్చే నా దంత రోగులందరి తరపున నాకు లభించినట్లు భావిస్తున్నాను'అని డాక్టర్ గౌడ్ పేర్కొన్నారు.

అధిక లోడు.. ప్రమాదం చూడు

- పరిమితికి మించిన లోడ్‌తో లారీల రాకపోకలు
- అవస్థలు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



రేగడిమైలారం–కొడంగల్ మార్గంలో ఓవర్ లోడ్‌తో వెళ్తున్న కంకర లారీ

బొంరాస్‌పేట: అధిక లోడుతో వెళ్తున్న వాహనాలతో నిత్యం అవస్థలు పడుతున్నామని మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిమితికి మించి ఇసుక, కంకర, కలప తదితర సామగ్రిని వేసుకొని నిత్యం వందలాది లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో త్వరగా రోడ్డు మరమ్మతులు గురవుతోంది. గుంతలు పడి ప్రయాణానికి ఆటంకం కలిగిస్తోంది. అదుపు చేయాల్సిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

లోపించిన పర్యవేక్షణ

మండల పరిధిలోని జాతీయ రహదారిపై గూడ్స్ వాహనాల రద్దీ రోజురోజుకు పెరుగుతోంది. పర్యవేక్షణ లేకపోవడంతో ఓవర్ స్పీడ్‌తో తరచూ ప్రమాదాలు జరిగి ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. మండలంలోని మెట్లకుంట శివారు తండాల నుంచి తుంకిమెట్ల, నాగిరెడ్డిపల్లి, రేగడిమైలారం మీదుగా కొడంగల్ వరకు 15 కిలో మీటర్ల దూరం జాతీయ రహదారి 163 ఉంది. దీనిపై మెట్లకుంట చెక్‌పోస్టు వద్ద వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. కాగా చౌదర్‌పల్లి శివారులో రెండు కంకర మిషన్‌లు, దుద్యాల మండల పరిధిలోని ఈర్లపల్లి, గౌరారం శివారులో మరో కంకర మిషన్ ఉంది. ఇక్కడి నుంచి అధిక లోడుతో లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. వెనకాల వచ్చే వాహనాలపై దుమ్ము ధూళి పడేసుకుంటూ అవరోధం సృష్టిస్తున్నాయి.

తరచూ ప్రమాదాలు

మహంతీపూర్, మద్దిమడుగుతండా, కొత్తూరు శివారుల్లో నుంచి బొంరాస్‌పేట కాగ్నా వాగు పారుతుండటంతో స్థానికంగా జోరుగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. ఇటీవల ఇసుక రవాణాకు అనుమతి లేకుండా పోలీసుల ముందు నుంచే పట్టపగలే ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. మండలంలో చెట్లను నరికివేస్తూ జోరుగా అక్రమ కలప రవాణా విచ్చలవిడిగా సాగుతోంది. దీనిపై సదరు అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తెలుపుతున్నారు. ఇలా ఓవర్‌లోడ్, అక్రమ రవాణాలతో అక్రమార్కులు కాసులు దండుకుంటున్నారు. అప్పుడప్పుడు అధికారులు చలాన్లు వేసినా ప్రయోజనం లేకుండా పోతోంది. వాహనాల రద్దీతో తరచూ ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.